स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत-उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future


# రెక్కవాలింది

పురాణం సుబ్రహ్మణ్యశర్మ

నటరాజన్ తమిళ రాష్ట్రం నుంచి వచ్చి, తెలుగులో ''శారద'' పేరుతో కథలు, నవలలు రాశాడు. పొట్ట చేతపట్టుకు వచ్చిన నటరాజన్ తెనాలిలో ఒక హోటల్‌లో సర్వర్‌గా పనిచేసేవాడు. మంచీ-చెడూ, అపస్వరాలు ఆయన పేరు చెప్పగానే స్ఫురించే శారద నవలలు. సమకాలీన తెలుగు రచయితలు శారదను తమతో చేర్చుకున్నారు. తెలుగు పాఠకులు ఆదరించారు. పత్రికలు గౌరవంగా ప్రోత్సహించాయి. 1912లో పుట్టిన నటరాజన్ 1955లో అకాల మరణం పాలయ్యారు. రైల్వేలో పనిచేస్తూ రచనలు చేస్తున్న పురాణం సుబ్రమణ్యశర్మ, శారద మరణించినపుడు విశాలాంధ్రలో రాసిన పదచిత్రం యిది. ఒకరకంగా శారదకు నివాళిగా, తనదైన ధోరణిలో రచించిన స్కెచ్. ఆనాటి యీ పదచిత్రాన్ని నవ్య పాఠకుల కోసం, సచిత్రంగా సమర్పిస్తున్నాం.



శారద (నటరాజన్)



## జీవితం స్టేషన్లోంచి....

**''సాహిత్యయాత్రా స్పెషలు ట్రెయిన్' బయలు దేరుతున్నదన్న ప్రకటన చూడగానే హడా విడిగా కవులూ రచయితలూ, కథకులూ- అనువాదకులు, పబ్లిషర్లూ తమతమ లగేజీ లతో- బస్సులు, మోటారులు, జట్కాలు, రిక్షాలు, ఒంటెద్దుబళ్లు, పడవలు, కాలినడకనూ వచ్చి- ఇష్టం వచ్చినట్లు సర్దుకు కూర్చున్నారు.**

**టాపుల మీదెక్కారు. ఫుట్‌బోర్డుల మీద వ్రేలాడుతున్నారు.**



పురాణం సుబ్రహ్మణ్యశర్మ


గార్డు గిరీశం కంగారుగా ఆ కొసనుంచి యీ కొసకు ఎర్రజెండా, పచ్చజెండాలు పుచ్చుకొని ప్లాటుఫారం మీద అస్తవ్యస్తంగా పడేసి వున్న బేళ్లకు బేళ్లు కవితా సామాగ్రిని తన్నుకుంటూ విసుక్కుంటూ పరుగెత్తుతున్నాడు.

తమ తమ రచయితలకి వీడ్కోలివ్వటానికి వచ్చిన పాత్రలతో, బండిలో చోటు కోసం కిటికీల దగ్గరా, గుమ్మాల దగ్గరా కుమ్ములాడుకుంటున్న కవులూ రచయితలతో జీవితం ప్లాటుఫారం నానా కంగాళీగానూ తయారయింది.

శరత్ సాహిత్యానికంటూ వో పెట్టె వేశారు. టాగూరు, బంకిములు కాకుండా తదిత ర అనువాద సాహిత్యానికంతటికీ మరో అదనపు బోగీ తగిలించారు. ఈ రెండు పెట్టెలూ పట్టనంతగా పుస్తకాల మధ్య కొనవూపిరితో మూలుగుతున్నవారు బెల్లంకొండ, రెంటాల, మద్దిపట్లసూరి, నీలకంఠం, శైలేంద్ర, గద్దె లింగయ్య, ప్రేమ్‌చందు ప్రచురణల సంఘం యింకా రకరకాల అనువాదకులు. ప్రచురణకర్తల పోటీల్లో పడి (అనువాదాన్ని అనుభవిస్తూ) చీనా,రష్యన్, హిందీ, వంగ సాహిత్యాల్లో నమూనాకి పదిరకాల్తో కిక్కిరిసి ఎడం లేకుండా కూర్చున్నారు.

టాల్‌స్టాయి- గోర్కీ- మపాసాల పంచె శరత్ అద్దకపు బంగాళీ లాల్చీ తొడుక్కుని నిశ్చింతగా పేపరు చదువుకుంటున్న వ్యక్తి ఎవరో కాదు, శరత్ బోగీ అంతా ప్రత్యేకంగా తనదే అన్నట్లు ఆక్రమించుకున్న శివరామకృష్ణగారు.


దీన్నానుకుని డిటెక్టివ్ బోగీ వేశారు. ఇందులో టెంపోరావు బృందం అంతా పీనుగలపై బ్రతికే రచయితల బృందం! నెత్తుటి చొక్కాలు, ట్రంకుల్లో దాచిపెట్టిన శవాలు, పోలీసు టోపీలు, పిస్తోళ్లు- వ్రేలిముద్దర వాళ్లూ- బండి సాహిత్యంలో జరిగిన హత్యాచారాల్తో దుర్వాసన కొడుతోంది. ఈ పెట్టెలోనే పలకల వెండిగ్లాసుతో ఎక్కిన ఆరుద్ర, పెద్ద కత్తిర ఆడిస్తూ కాళరాత్రి అని అరుస్తూ ప్రఖ్యా శ్రీరామమూర్తి, ఒంటి కంటి రహస్యంతో కనకమేడల, అప్పుడే హత్య చేసిన ప్రమీలాదేవిని మోసుకుంటూ సాంబశివ రావు, శాస్త్ర పరిశోధనలకు కనపడని చొక్క తొడుక్కొని దిగంబరంగా కూర్చున్న ఎన్. ఆర్. నందీ, హత్యా; మరణమా అని అరుస్తూ వజ్రపాణి అంతా యే నిమిషంలో ఎవర్ని పొడుచుకుంటారో, ఏం జరుగుతుందో ఊహించటం కష్టం.



దేవులపల్లి కృష్ణశాస్త్రితో ఎంకి పాటల నండూరి సుబ్బారావు


ఆర్. ఎం. ఎస్. లో శ్రీశ్రీ కూర్చుని సిగరెట్టు కాల్చుకుంటున్నారు. ఆయన 'మహాప్రస్థానాన్ని' చింపి గేయాల్ని అక్షరమక్షరమూ కత్తిరించి, ఒక తందాన కవులు బంకపెట్టి తమ చంకల్లోని పుస్తకాల్లో అంటించుకుని మురిసిపోతున్నారు. దీనికనుబంధంగానే వ్రేలాడుతున్న 'జనానా పెట్టె'లో మధుర కవిత్వ సాంప్రదాయాలకు చెందిన నిరపాయకరమైన కవులు రాయప్రోలు, కృష్ణశాస్త్రి, పింగళి, కాటూరి, నండూరి యిత్యాదులంతా తమలపాకులకు సున్నం రాసుకుంటూ నాలుక పండిందో లేదో చూసుకుంటూ ఖులాసాగా కబుర్లు చెప్పుకుంటున్నారు. దాటిన కోటగోడల్ని గురించి.

దీని తరువాత సమశీతోష్ణపు పెట్టెలో వాతావరణానికి అనుగుణ్యంగా వ్రాసేవారు ముఖ్యంగా సినిమా రచయితలూ, డాక్యుమెంటరీ కవులూ కూర్చున్నారు.



स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत - उज्वल भविष्य Glorious Past-Brighter Future

దీనికానుకుని వున్న పెద్దపెట్టె కథకులది. లోపల చోటుకోసం గుమ్మం దగ్గిరే చాలా మంది కథకులు తమ తమ లగేజీలతో త్రోసుకుంటూ, కేక లేసుకుంటూ, ఆదుర్దాగా కిటికీలోంచి లోపలికి తొంగి చూస్తూ నిరాశ పడ్తున్నారు. అందులో ముని మాణిక్యంవారు హోల్డాలు పర్చుకొని కాంతానికి శుభ్రంగా మల్లెపూల్లాటి ప్రక్కేసి, కాళ్లకాడ దిక్కున



జరుక్ శాస్త్రి

కూర్చొని ఆ చోటు మరెవ్వరూ కాజెయ్యకుండా చూస్తున్నారు. చింతాదీక్షితులు, వటీరావు పై బెర్తు మీద ఎల్లాగో సర్దుకున్నారు. 'హల్లోవ్ బావా!'' అని అమృతం కేకెయ్యగా టు- బి - ఆర్ - నాట్ టు బి అన్న కొశ్చన్‌లో పోజు పెట్టి హేమ్‌లెట్ వాల కంలోన్ను వారు బుచ్చిబాబుగారు. బల్లక్రింద పరుండి 'రత్తి కోక గట్టింది' అని పలువరిస్తున్న వ్యక్తి మా గోఖలే. ఎవరో అణాకాసు పారేసుకుంటే అది చల్లగా సంగ్రహించి 'వెధవ డబ్బు' అని గొణు క్కుంటున్న నిండైన తొణకని విగ్రహం పాలంకి. ఇర వయ్యవ శతాబ్దపు రచయితలు తత్వవేత్తలు కాగల రన్న ప్రమాదంలో పడి దీక్షితులుగార్కి ప్రక్క పై బెర్తులో యశోదా గీతాలు పాడుకుంటున్నవారు వెంకటాచలంగారు. కార్నరు సీటులో కుటుంబరా వుగారు నిర్లక్ష్యంగా కూర్చొని గమనిస్తున్నారు, గంజి కేంద్రంలోకి ఎగబడేలా పెట్టెమీదకు ఎగబడు తున్న కథకులతండాకు ఎక్కడా చోటు దొరక్క

కాంతంపరున్న చోటు దిగువను ప్రమదా వనం బైండ్లను ఎత్తుగా పేర్చుకొని అందు మీద కూర్చుని లేసు అల్లుకుంటున్న వారు మాలతీ చందూర్. బెదుర్తూ బెదుర్తూ ఆవిడ ఏమంటారోనని స్టారు సిగరెట్టు కాల్చుకుంటూ నల్లకోటు వేసుకున్న అల్ప జీవి విశ్వనాథశాస్త్రి. ఒంటికాలి మీద నిల్చున్న సదరు పెట్టెలో యెడము చాల్నందున క్రొత్తరాస్తా ఒకటి చూడడము కోసమున్నూ, గోదావరి గాలిలేక తలపుల తలుపులు మూయటమున్నూ జరిగాక కవికొండల వెంకటరావుగారు గోపికా గీతాలు పాడుకుంటున్న తెన్నేటిసూరిగా రిని భారతస్త్రీ ఆదర్శం ఏమిటండీ అని రహస్యంగా అడిగారు. ఆ ప్రక్కనే సుద్ద ముక్క తీసుకొని రైలుపెట్టి గోడల మీద 'దొంగలుం టారు జాగ్రత్త' అని వ్రాస్తున్న రైల్వే భాషా సంస్కరణాభి లాషి బొమ్మిరెడ్డిపల్లి సూర్యా రావు. దొంగలున్నారు జాగ్రత్త అన్నదేరైటు. నా మచ్చల శంఖం ఎక్కడో పోయింది అని కంప్లె యిన్టు చేస్తున్న వ్యక్తి హితశ్రీ. గేటు దగ్గరే వచ్చే దారికడ్డుగా బయల్దేరిన ముహూర్తం మంచి ముహూర్తం కాదని విసుక్కుంటూ హోల్డాలు మీద కూర్చున్న వారు బలివాడ కాంతారా వుగారు. కాంతారావుగారిని టోకరా వేద్దామని కిటికీ దగ్గన అవకతవకల ఆకుచెప్పుల జోడును పుచ్చుకొని అమ్మజూపుతున్న వ్యక్తి శాండిల్య. కాంతారావు పెంకుటిల్లుతో, దాన్ని ఎవరైనా పాడు చేస్తారేమో అన్న బెంగతో బితుకుబితుకుగా చూస్తూ, మోకాళ్లమీద కూర్చున్న పల్చటి కోల పాట ఇముఖం కుర్రాడు కొమ్మూరి వేణుగోపాలరావు. గులాబీ ముళ్లతో వొళ్లు చీరుకుపోగా విసుగుకుంటున్న వ్యక్తి ఇచ్చాపు రపు జగన్నాథరావు. కర్రాచెప్పులతోటి కిటికీలోంచి వద్దంటున్నా దూసుకొని కాస్త దూకుడుగా వచ్చి వేరుశనక్కాయలను చిటపట లాడిస్తున్న వ్యక్తి నార్ల చిరంజీవి. ఒక అసహ్యాకరమైన కుంటిదాన్ని వెంటే సుకుని భుజంమీద కోతితో లోపలికి రానివ్వమని బ్రతిమిలాడుకుంటున్న మనిషి పురాణం సుబ్ర హ్మణ్య శర్మ. కాంతారావుగార్ని సాగనంపటానికి ఆయన అన్నపూర్ణ వస్తే 'ఆవిడే నా రాగమయి. లోపలకు సాయం పట్టండి' అని చెంగుపుచ్చుకొని లాగుతున్నది కాళీపట్నపు రామారావు.

హఠాత్తుగా బాత్‌రూం తలుపు తెర్చుకుంది. అందులోంచి ముఖం తుడ్చుకుంటూ కుటుంబ రావు వైపు బాగా కోపంగా చూస్తూ హుందాగా నడిచి వెళ్తున్న పద్మరాజుగారిని చూడగానే పెట్టెలో కలకలం బయల్దేరింది.

'అయ్యా! మీరు ఎక్కడున్నా చిన్న గాలివాన



శ్రీశ్రీ


సృష్టించగలరు. తడిసిపోతాం. సమశీతోష్ణపు పెట్టె లోకి పోయి కూర్చోకూడదూ! అని అభ్యర్థించా రంతా. ఆయన గంభీరంగా అక్కడ్నుంచి లేచి దిగి వాతావరణానికి అనుగుణంగా రాసే సినిమా పెట్లోకిపోయి కూర్చున్నారు.

ఈ బాత్‌రూం ఖాళీ కాంగానే ధనికొండ భర ద్వాజ, దాసరి సుబ్రహ్మణ్యం చౌడేశ్వరీదేవిని వెంట బెట్టుకొని అంతా అందులో గెడిపెట్టేసుకున్నారు.

'ఈ పూట విశేషాలు' అంటూ సహజ గంభీర స్వరంతో ఏదో హెచ్చరించబోయిన పన్యాల రంగ నాథరావుగారు మాట్లాడకుండానే ముళ్లపూడి వెంకట రమణ తన వీపుమీద ఎవరో తుంటర్లు అంటించిన సినిమా పోస్టర్లు చూచుకోకుండానే 'యిందులోకన్నా జనతా ఎక్స్‌ప్రెస్సులోనే సుఖంగా వుండేట్లుంది ప్రయాణం' అని ఎవ్వరూ నవ్వకపోవటం చూసి లెట్రిన్ గేటు సందుల్లో యిరుక్కున్న మురయాను 'సురయా సురయా అని పిలిచాక అంతా గొల్లుమన్నారు.

కనుక్కోగా తెలిసింది.

బైటప్లాటుఫారమ్మీద కథకుల బోగీ తప్పించి ఎడరెక్కా పెడరెక్కా విరిచి లాక్కుపోతున్నారు గోపీచంద్‌గారిని చెరోవైపు జబ్బ దొరకపుచ్చుకొని లక్ష్మమ్మ- పేరంటాలూను. ఎట్నుంచి వచ్చారో



బుచ్చిబాబు

ఎవరూ గమనించకుండానే, పాముపాట పాడుకుంటూ పరవళ్లు తొక్కేలా కళ్లల్లో నిప్పుల్ని కురిపిస్తూ వచ్చారు విశ్వనాథ సత్యనారాయణగారు. ఈయన్ని చూసి పాముని చూచి దడుసుకుంటున్నట్లు ఎక్కడ కాటేస్తారోనని జనం ప్రక్కకు ప్రక్కకు తప్పుకుంటుండగా గిరీశం చిన్నకబురు, వన్ వర్డు యిల్లా బయటకురండి' అంటూ శ్రీవారిని ఎగ్జిబిషను బోగీలో ఎక్కించారు. అక్కడ ఒకే ఒక ఆసామీ కూర్చున్నారు శాలువాలూ, వైఖరినీ పట్టి పోల్చవచ్చు గాని పెట్టెలో మసకమసగ్గా వుండటం వలన సత్యనారాయణగారు మెడకాస్త అలవాటుగా వూయించారు. గిరీశం వంక ప్రశ్నార్థకంగా చెవిటివాళ్లకు చెప్పేలా అభినయిస్తూ 'యిది ఆస్థానకవులపెట్టె అండీ వెనక హైదరాబాదు నైజాం యార్ బహదూరు జంగు' ఆపు ఆపవోయి అని సత్యనారాయణగారు 'అలనన్నయ్యకు లేదు అంటూ పద్యం అందుకున్నారు.

గార్డు గిరీశంగారు బ్రేకునానుకొని అటువైపున ఖాళీ అంతా నాటక సాహిత్యానికి కేటాయించారు. అందులో ఒక పంజరం వ్రేలాడుతోంది. గిరీశంగార్ని అడగ్గా అది ఆచార్య ఆత్రేయ ప్రాణపంజరమని, ఆయన బొందెమాత్రం 'తెప్పలుగ చెరువు నిండిన కప్పలు పదివేలు చేరు' అన్నట్లు చలువ పెట్లో సినిమా రచయితల గుంపులో దూరిందనీ శలవిచ్చారు. ఇంకా సబ్ ఇన్‌స్పెక్టరుని ధీరోదాత్త



విశ్వనాథ



పాలగుమ్మి

నాయకుడిగా చేసిన పల్లెపడుచు పినిశెట్టిగారూ, నరసరాజుగారి నాటకం బూటకపు ఎక్విప్‌మెంట్, బెల్లంకొండ రామదాసుగారు అనువాదపు పెట్టెలో పునర్జన్మ ఎత్తకముందు మర్చిపోయిన బెడ్డింగు, గాలిమేడల్లో వూగుతున్న అనిశెట్టి, వీర్ల మధ్య యినుపతెరల్ని లాక్కొని, నిత్యోత్సాహంతో మాట్లాడుతున్న వారు కొప్పరపు సుబ్బారావుగారు. సుంకర, వాసిరెడ్డి 'వీరకుంకుమ' మెత్తుకుంటున్నారు చెరికాస్తా భూమికోసం పోతుగడ్డ మీద కూర్చొని. ఇంకా కొత్తవాళ్లు ఎవరెవరో వున్నా పెట్టె మటుకు ఖాళీగానే వుంది. గిరీశంగార్ని కనుక్కోగా చింతామణి, సక్కుబాయి, తులాభారాల బోగీని అంతక్రితమే కోసేసి గూడ్సుబండికి తగిలించారని తెలిసింది.

రెక్క వాలింది.

గార్డు గిరీశం విజిలూదాడు. జీవితం స్టేషనులోంచి ఒక దశాబ్దం ట్రైయిను టైమ్‌తో సాహిత్య యాత్రా స్పెషలు ట్రైను బయల్దేరింది.

బండి బయల్దేరాక గిరీశంగారిని బ్రతిమాలుకుంటూ ఏ పెట్టెలోనైనా తను ఎక్కడానికి అర్హత వుందని దబాయిస్తున్నవారు- బ్రేకువెనక పరుగెత్తబోయి స్తంభాన్ని గుద్దుకుని తలబొప్పికట్టగా ఆగిపోయినవారు శ్రీ వాత్సవ. శరీరమంతా లబ్బుగా ముచ్చెమటలు పోసిపోయింది. దగాదగా కుడి ఎడమలు దగా. ఇంకా కమ్మీలు పట్టుకు వ్రేలాడుతున్న వారిలో పంతుల శ్రీరామశాస్త్రి, చాగంటి, కందుకూరి లింగరాజు, ఇసుకపల్లి కె. సభా, శారద, ముద్దంశెట్టి హనుమంతరావు, అంగర వెంకట కృష్ణారావు, సూర్యారావులు, అవసరాల సూర్యారావు, రామకృష్ణారావులు వున్నారు. జీవితం ప్లాటుఫారం యింకా దాటకుండానే ఎవరో చెయిన్ లాగారు కథకుల బోగీలోంచి. ఒకరెవరో ఫుట్‌బోర్డు మీంచి జారి పట్టుతప్పి సాహిత్య యాత్రాస్పెషలు ట్రయిను కిందపడి ప్రాణం పోగొట్టుకున్నారు.

అయ్యో! అతడు శారద. అంతా కళ్లు మూసుకున్నారు. ఆ దుఃఖం భరించలేక. ఆ దృశ్యం భరించలేక. మరో బోగీ ఎందులోకెక్కినా చోటు దొరకదే- జీవితం స్టేషను బలికోరింది.

గిరీశం వచ్చి అంతా శుభ్రం చేశాడు. అరగంట దాటాక బండి మళ్లీ ముందుకు సాగింది. కదిలినట్టే కదిలి మళ్లీ వెనక్కు రానారంభించింది. ఒక ఫర్లాంగు మెట్ట తగిలేసరికి 'ఇదేమిటీ రైలు వెనక్కు స్టేషనులోకి పోతోందే?' అన్నారంతా.

स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत - उज्वल भविष्य Glorious Past-Brighter Future

బండిజీవితం స్టేషన్లోకొచ్చింది మళ్లీ. డిటెక్టివ్, అనువాద సాహిత్యం- యీ బోగీలు కోసేసి సైడ్వింగులు తీసేశారు.

చిన్నా పెద్ద రచయితలంతా తమపాత్రలతో పరిసరాల్లో రాజీపడి సర్దుకు కూర్చున్నారు. మునిమాణిక్యం వారు కాంతాన్ని తీసి ప్రక్క దులిపారు. సైడ్వింగులలోకి నెట్టి వేయబడుతున్న అనువాదపు పెట్టెలోంచి ఘోషలు మిన్నుముట్టుతుండగా, సాహిత్య యాత్రాస్పెషలు ట్రయిను మువ్వలా బరిమీ పాములా, జీవితం స్టేషన్లోంచి చురుగ్గా బయల్దేరింది.

అప్పటికే లేటయి అందుకోలేనివారంతా ప్లాటుఫారం మీద నిలబడి దిక్కులు చూస్తుండగా వాలిన రెక్క మళ్లీ లేచేవరకూ గిరీశంపచ్చజెండా




జోరుగా వూపుతూనే వున్నాడు.

శారద నుండి చిమ్మిన నెత్తురు బద్దీల మీద అల్లానే వుంది ఎవరూ చెరుపలేదు.

బండి జీవితం దాటి పరుగుచ్చుకుంది.